## జాతరకు రావాలని మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత



మంత్రి పొన్నంకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మార్చి 27,ప్రభాతవార్త :** బెజ్జంకి లక్ష్మీనరసింహస్వామి జాతరకు రావా లని హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం కలిసి ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, వార్డు సభ్యులు బొనగం రమేష్, ఆలయ కమిటీ సభ్యులు గుబురే చంద్రం, నాయకులు పుర్మ నారాయణరెడ్డి, ఐలేని మహేందర్‌రెడ్డి, దోనె వెంకటేశ్వర్‌రావు,సంఘ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

## చేర్యాలను వెంటనె రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

**చేర్యాల, మార్చి 27,ప్రభాతవార్త :** చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సయ్య పంతులు పాల్గొని మాట్లాడుతూ గురువారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్క నాయకుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని ఈ ప్రాంత ప్రజల్లో ఆకాంక్ష బలంగా ఉందని తెలిపారు. నాయకులు, ప్రజలు రెవెన్యూ డివిజన్ అంశంపై ఏ పోరాటానికైనా ముందుకొచ్చేందుకు సిద్దంగా ఉన్నారన్నారు.ప్రభుత్వం కాలయాపన చేస్తూ మొండిగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుర్జకుంట సర్పంచ్ కాసెట్టిపందు,బిజెపి రాష్ట్ర నాయకులు పోతుగంటి రాందాస్,బీఆర్ఎస్ నాయకులు పురుమ వెంకట్ రెడ్డి,టి ఎమ్ ఆర్ పి ఎస్ జిల్లా నాయకులు భూమిగారి రాజేందర్,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో,సిపిఎం మండల కార్యదర్శి బండ కింది అరుణ్ కుమార్,సిపిఎం నాయకులు పోలోజు శ్రీహరి, తుప్పతి రాజు,నంగి మైసయ్య,తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు మిట్టపల్లి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణం

### పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :** పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆలయంలో నిర్వహించిన కళ్యాణంలో పాల్గొని, శ్రీసీతా రామచంద్రస్వామి వారి దివ్య కళ్యాణాన్ని భక్తులతో కలిసి వీక్షించారు. అనంతరం అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులు పెద్దసంఖ్యలోహాజరై స్వామివారి కళ్యాణోత్సవాన్ని పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మికొమురయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మరవిందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవ కానుకగా ఫల పుష్పాలు పంపించిన హరీష్‌రావు



ఫల పుష్పాలు తీసుకెళ్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మార్చి 27,ప్రభాతవార్త:** సిద్దిపేట నియోజకవర్గం లోని 60 దేవాలయాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శ్రీరామ నవమి శ్రీ సీతా రామచంద్ర స్వామి కళ్యాణోత్సవ కానుకగా ఫల పుష్పాలు పంపించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలతోపాటు సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవానికి హరీష్‌రావు పంపించిన ఫల పుష్పాలను బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి కవిత దంపతులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజు, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి,కౌన్సిలర్లు సమర్పించారు. పట్టణంలోని రామాలయం, పంచముఖ హనుమాన్ దేవాలయం,గణేష్ నగర్,శ్రీరామరాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయలతోపాటు పలు దేవాలయాలో ఫలపుష్పాలు సమర్పించారు. చిన్నకోడూరు మండలపరిధి లోని అల్లీపూర్, మైలారం, కమ్మర్లపల్లి, మేడిపల్లి, సలేంద్రి, మాచాపూర్, చంద్లాపూర్, గోనెపల్లి గ్రామాలలో నిర్వహించిన స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో ఫలపుష్పాలు అందజేశారు. నంగునూర్ మండల పరిధి లోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవానికి హరీష్‌రావు కానుక ఫలపుష్పాలు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కామిని శ్రీనివాస్, కామిని ఉమేష్‌చంద్ర, కాల్వ ఎల్లయ్య, పాపయ్య, జాప శ్రీకాంత్‌రెడ్డి, లింగంగౌడ్, సోమిరెడ్డి, సారయ్య, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

## మళ్లీ గులాబీ గూటికి ప్రవీణ్!!

### 24 గంటల్లో రెండు కండువాలు....

### మా వాళ్లను బలవంతంగా చేర్చుకుంటే కోర్టుకు వెళ్తాం

### పద్మాదేవేందర్‌రెడ్డి హెచ్చరిక...

**రామాయంపేట, మార్చి 27, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో రాజకీయ పరిణామాలు ఒక్కరోజులోనే ఊహించని మలుపు తిప్పాయి. 2వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్ 24 గంటల్లోనే రెండు పార్టీల కండువాలు మార్చడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీ తరఫున గెలిచిన ప్రవీణ్ గురువారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడం స్థానికంగా సంచలనం రేపింది. అయితే ఆ పరిణామం జరిగిన మరుసటి రోజే, అంటే శుక్రవారం తిరిగి సొంత పార్టీ బిఆర్ఎస్‌లోకి చేరడం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో ప్రవీణ్ మళ్లీ గులాబీ గూటికి చేరాడు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, వార్డు అభివృద్ధి నిధుల కోసం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నివాసానికి వెళ్లగా తనకు బలవంతంగా కాంగ్రెస్ కండువా వేసి చేర్చుకున్నారని ఆరోపించాడు. తనకు బిఆర్ఎస్‌ను వీడే ఆలోచనే లేదని, తన రాజకీయ జీవితం మొత్తం గులాబీ పార్టీకే అంకితమని స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ నాయకులను మభ్యపెట్టి, భయభ్రాంతులకు గురిచేసి కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల తీర్పుతో గెలిచిన ప్రజాప్రతినిధులను బలవంతంగా పార్టీలోకి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని చెప్పారు. ఇలాంటి చర్యలు కొనసాగితే కోర్టును ఆశ్రయించడంలో వెనుకాడమని వారు హెచ్చరించారు. రామాయంపేటలో చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో మరింత వేడి రేపుతోంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాధవి రమేష్, నాయకులు చౌదరి సుప్రభాతరావుతోపాటు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రవీణ్‌కు కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



కొమురవెల్లి అంజనేయ స్వామి దేవాలయంలో...



నంగునూర్‌లో...



నాచగిరి క్షేత్రంలో...



గజ్వేల్ శ్రీసత్యసాయిబాబా దేవాలయంలో

# కనుల పండువగా శ్రీరాములోరి కళ్యాణం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** శ్రీరామ నవమిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం ఊరురా.. కనుల పండువగా నిర్వహించారు. జిల్లాలో శ్రీరామ, హనుమాన్ దేవాలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. వేదమంత్రోచ్చారణల మధ్య పచ్చని పందిళ్ల కింద మంగళ వాయిద్యాలు మోగుతుండగా శ్రీసీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక దోభిగల్లిలోని రాముల గుడిలో వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అలాగే గణేష్ నగర్, కూరగాయల మార్కెట్, శివాజీనగర్, పంచముఖ, శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయం కరీం నగర్ రోడ్డులోని హనుమాన్ దేవాలయాలతోపాటు కోటి లింగేశ్వరాలయం, షిర్డిసాయిబాబా తదితర దేవాలయాల్లో కళ్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో నిర్వహించిన శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీరాముడు సందేశం నేటి సమాజానికి అవసరం**

**కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ**

శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచారని, సత్యం, న్యాయం, నీతి మార్గంలో నడవాలని అందరికీ శ్రీరాముడు ఇచ్చిన సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్, చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామాలలో నిర్వహించిన శ్రీసీతారామచంద్ర స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాలలో ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను శాలువాలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమాలలో నాయకులు, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మీ, కొంగ సాంబమూర్తి, రవికుమార్, ఎర్ర మహేందర్,వంశీ పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

**కొమురవెల్లి/బెజ్జంకి/ నంగునూరు/చిన్నకోడూరు/తొగుట, మార్చి 27, ప్రభాతవార్త :** శ్రీరామనవమిని పురస్కరించుకొని కొమురవెల్లి మండలం లోనూ, మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి అంజనేయ స్వామి దేవాలయంలో సీతారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవం వేదమంత్రాలతో పురోహితుల అధ్వర్యంలో కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ అధికారులురావు సుదర్శన్, చంద్రశేఖర్, మధు సూదనశర్మ, స్థానాచారి మల్లయ్య, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్,సర్పంచ్ గొల్లపల్లి పద్మఅంజనేయులు, పాములపల్లి కనకచారి వసంత దంపతులు గ్రామస్తులు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**

శ్రీరామనవమిని పురస్కరించుకుని నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పాలమాకుల హనుమాన్ దేవాలయం, నంగునూర్ రాముల గుడిలో, తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి గ్రామాల శివారులోగల శ్రీ చింతగట్టు గరుడఆంజనేయస్వామి సన్నిధిలో రాజగోపాల్ పేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. అనంతరం దేవతల స్థాన గ్రహణ యాగం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్‌లు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కళ్యాణ మహోత్సవంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, ఓజాల్ యాదవ్, లింగంగౌడ్, రంగు రాజు, రవీందర్‌రెడ్డి, వేణు, కనకరాజు,రవీందర్‌రెడ్డి, రవి, దుర్గయ్య, ఐలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

శ్రీరామ నవమి సందర్భంగా చిన్నకోడూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో హనుమాన్, రామలాయాల్లో బుధవారం శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహించారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని రంగనాయకుల స్వామిగుట్టలో, శేరిపల్లి హనుమాన్ దేవాలయంలో తదితర గ్రామాల్లో వేదమంత్రోచ్చారణల మధ్య పచ్చని పందిళ్ల కింద మంగళవాయిద్యాలు మోగుతుండగా శ్రీసీతా రాముల కళ్యాణం జరిగింది. అలాగే సలేంద్రిలో శ్రీసీతా రాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నారాయణరావు పేట మండలం జక్కాపూర్‌లోని శ్రీరామలయంలో నిర్వహించిన కళ్యాణోత్సవం నిర్వహించారు. అలాగే గుర్రాలగొందిలో కళ్యాణోత్సవం నిర్వహించారు.

**తొగుటలో...**

తొగుట మండల కేంద్రంలో శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కళ్యాణ ఉత్సవానికి అతిథిగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవంలో భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్, సర్పంచ్ పాగాల శోభా కొండలరెడ్డి, రాంపూర్ సర్పంచ్ లచ్చల రవీందర్, పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, గాంధారి నరేందర్‌రెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు, నిరంజన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరసింహ్మారెడ్డి, సీనాకర్‌రెడ్డి, చంద్రశేఖర్,భరత్‌తేజ, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం సాయంత్రం బండ్లు తిరుగుట కార్యక్రమం నిర్వహించారు.

**బెజ్జంకిలో...**

శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న శ్రీరామ, హనుమాన్ దేవాలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. మండల పరిధిలోని తోటపల్లి, దాచారం, లక్ష్మీపూర్, చీలాపూర్, వడ్లూరు, గాగిల్లాపూర్ గ్రామాల్లో గల రామాలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను, అమ్మవారికి చీరెసారెలను భక్తులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ఆటపాటలతో ఊరేగించారు. అయా కార్యక్రమాలలో సర్పంచ్‌లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధూళిమిట్ట మండలంలో...

**ధూళిమిట్ట, మార్చ్ 27,ప్రభాతవార్త :** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా సీతారాముల కళ్యాణం వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణం కనుల పండువగా జరిగింది. అలాగే తోర్నాల గ్రామంలో సర్పంచ్ చొప్పరి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణం కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**నాచగిరిలో...**

**వర్గల్, మార్చి 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలోని ఉపాలయమైన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వివిధరకాల పూలతో అలంకరించిన వేదికపై వేదమంత్రోశ్చరణలు, బాజాభజంత్రీల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.రవీందర్‌గుప్తా, కార్యనిర్వహణాధికారి బెల్లంకొండ రంగాచారి, పాలకమండలి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్య, కర్రె పద్మ వెంకటేష్, శేఖర్‌గుప్తా, నాచారం సర్పంచ్ సారిక యాదగిరి, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**గజ్వేల్ పట్టణంలో...**

**గజ్వేల్ టౌన్, మార్చి 27 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీసత్యసాయిబాబా దేవాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డిలు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు.

**కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో...**

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకొని శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుకునూరుపల్లి, కొండపాక మండల కేంద్రాల తోపాటు మర్పడ్గ, సిర్సనగండ్ల, బందారం, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి, ఖమ్మంపల్లి, తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, చిన్న కిష్టాపూర్, రాయవరం, తిప్పారం, మాత్‌పల్లి, మంగోల్ బొబ్బాయిపల్లి తదితర గ్రామాలతోపాటు అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయాలు, రామ మందిరాలు, ఇతరదేవాలయాల ముందు పచ్చని పందిళ్లు వేసి, పచ్చని తోరణాలుకట్టి, వేద మంత్రోచ్చరణలతో, భాజ భజంత్రిల చప్పుట మధ్య శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణమహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవం తిలకించి మొక్కులు మొక్కుకున్నారు.



శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పాములపర్తిలో శ్రీ సీతారాముల కళ్యాణం

**రాయపోల్ మండలంలో...**

**రాయపోల్, మార్చి 27 (ప్రభాతవార్త):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయపోల్ మండల కేంద్రం తోపాటు పలు గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం జరిగింది. కళ్యాణ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు.

**మర్కుక్ మండలంలో...**

**మర్కుక్, మార్చి 27 (ప్రభాతవార్త):** శ్రీరామనవమి పురస్కరించుకొని మండల పరిధిలోని దామరకుంట, మర్కుక్, అంగడికిష్టాపూర్, చేబర్తి, పాములపర్తి తదితర గ్రామాలలో శ్రీసీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు మహా అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దామరకుంట సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్, చేబర్తి సర్పంచ్ ర్యాకం యాదగిరి, అంగడికిష్టాపూర్ సర్పంచ్ కొండల్‌రెడ్డి, పాములపర్తి సర్పంచ్ భవాని బాలకిషన్, మాజీ ప్రజాప్రతినిధులు పాండుగౌడ్, రామచంద్రం, బాల్‌రెడ్డి, మేకల కనకయ్య, నాయకులు హరిపంతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కుకునూరుపల్లి మార్కెట్ వేలం పాట

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కురగాయాల మార్కెట్ (సంత), ప్రభుత్వ ఫంక్షన్ హాల్‌ను 2026, 2027 సంవత్సరానికిగాను బహిరంగ వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి స్వప్న తెలిపారు. ఈ నెల 28న స్థానిక సర్పంచ్ మల్లం కనకవ్వఐలయ్య అధ్వర్యంలో ఎంపిఒ సమక్షంలో ఉదయం 11.00 గంటలకు వేలం వేయడం జరుగుతుందని అమె వివరించారు. వేలం పాటలో పాల్గొనేవారు గతంలో గ్రామ పంచాయతీకి ఏలాంటి బకాయిలు ఉండరాదని, వేలం పాటలో పాల్గొనేవారు మార్కెట్‌కు, పంక్షన్ హాల్‌కు వేరు వేరుగా రూ॥ 10 వేల ధరవత్ చెల్లించాలని, వేలం పాటలో పాల్గొని వేలం పాట దక్కించుకున్నవారు అదే రోజు వేలం పాడిన మొత్తంలో సగం చెల్లించాలని, వేలం పాట దక్కించుకున్న వారు వ్యక్తిగతంగా 9 ఖాళీ బ్యాంకు చెక్కులను గ్రామ పంచాయతీకి ఇవ్వాలని సూచించారు. పంక్షన్ హాల్ వేలం దక్కించుకున్నవారు మార్కెట్ యొక్క నిందనాల ప్రకారం డబ్బులు చెలినంచాలని కోరారు.

## ఏప్రిల్ 1న ఇసుక నిల్వలు వేలం

**చౌటకూరు, మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలో ఆక్రమంగా మంజీరానది నుంచి ఒడ్డుకు తరలించిన ఇసుక నిల్వలను ఏప్రిల్ 1న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ నామాల కిష్టయ్య తెలిపారు. మండల కేంద్రమైన చౌటకూరులో 20 టన్నులు, వెండికోలులో 20టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు, సీజ్‌చేసిన ఇసుకను వేలం వేస్తామని, ఆసక్తిగలవారు 5వేల రూపాయలను చౌటకూరు తహసీల్దార్ పేరుపై 5వేల రూపాయల డిడిని మార్చి31వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో అందచేయాల్సి ఉంటుందన్నారు. డిడిలు అందచేసినవారు వేలంపాటలో సమయానికి పాల్గొనాలని తహసీల్దార్ నామాల కిష్టయ్య సూచించారు.

# జిల్లాలో వైభవంగా సీతారాముల కళ్యాణం

**సంగారెడ్డి బ్యూరో , మార్చి 27, ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. లోకకళ్యాణార్థం జరిగిన సీతారాముల కళ్యాణోత్సవాన్ని కళ్లారా వీక్షించి భక్తులు తన్మయత్వం చెందారు. జిల్లాలోని అన్ని రామాలయాలు భక్తుల జయజయధ్వానాలతో మార్మోగాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పట్టణాల నుండి పల్లెల వరకు ప్రతి రామాలయం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. జిల్లాలోని చారిత్రాత్మక ఆలయాలు ఈ వేడుకలకు ప్రధాన వేదికలుగా నిలిచాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని పురాతన రామాలయాలతో పాటు, జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, ఆందోల్ ప్రాంతాల్లోని ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్ప తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీరామ నవమి అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది సీతారాముల కళ్యాణం. జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎండప్రభావం తగలకుండా ఆలయ కమిటీలు చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించారు. సంగారెడ్డిలోని రామ్‌నగర్, రామ్‌మందిర్‌లో శ్రీసీతారాముల కళ్యాణం ఉత్సవం వైభవంగా జరిగింది. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో రామ్‌మందిర్‌లో శ్రీసీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. రంగపేట పీఠాధిపతులు మాధవనంద సరస్వతి స్వామి వారి పర్యవేక్షణలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. జగ్గారెడ్డి, మిత్రులు, రామ్ మందిర్ యువసేన, రామ్ మందిర్ ఆలయ కమిటీ పెద్దల సహకారంతో సీతారాముల కోసం ప్రత్యేకంగా 2.50 కోట్ల రూపాయలవిలువైన బంగారు వెండి ఆభరణాలతో అలంకరించారు.

సీతారాముల వారికి 2 కిలోల 250 గ్రాముల బంగారంతో కర్ణాభరణాలతో కూడిన కిరీటాలు,కంఠాభరణాలు, వడ్డానాలు, పద్మ పాదాలు, ధనస్సు, బాణం, యజ్ఞోపవేతం, నయనాలు, తిలకాలు, ముక్కుపోగు, శంకు చక్రాలు, అమ్మవారికి మంగళ సూత్రం, కమలహస్తం, శ్రీరాముల వారికి శరంతో కూడిన హస్తం బహూకరించారు.ఈ సందర్భంగా రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి ఇంట్లో ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రామ్ మందిర్ వరకు ఊరేగింపు నిర్వహించారు.



సంగారెడ్డిలో నిర్వహించిన కళ్యాణోత్సవంలో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి, భక్తులు

## చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

**రాయపోల్, మార్చి 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బేగంపేట గ్రామంలోని బాలాజీ బిన్ని మోడ్రన్ రైస్‌మిల్‌లో ఇటీవల జరిగిన వడ్లసంచుల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈనెల 13వ తేదీన చోటుచేసు కున్న ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం... అదే గ్రామానికి చెందిన వడ్లకొండ వంశీ, మోతకాని రవి, తీగుళ్ల మహేష్‌లు చోరీకి పాల్పడ్డారని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపిన అనంతరం వారినుంచి దొంగిలించిన వడ్ల సంచులు, అశోక్ లేలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

### బొమ్మ బొరుసు ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

### రూ. 18,500 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం...

**పాపన్నపేట, మార్చి 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో బొమ్మా బొరుసు ఆడుతున్న 7 మందిని పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం పాపన్నపేట రామారపు తోటలో కొందరు బొమ్మ బొరుసు ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా,కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 18 వేల ఐదువందల నగదు, 5 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, జూదా లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం కారణంగా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతోపాటు సమాజంలో చెడు ప్రభావం పడుతుందని తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తు న్నట్లు సమాచారం ఉంటే వెంటనే పాపన్న పేట పోలీస్ లకు తెలియ జేయాలని ప్రజలను కోరారు.

## వైభవంగా భాగ్యలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవా ఊరేగింపు

**చార్మినార్,మార్చి 26 ప్రభాతవార్త :**
చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం ఆధ్వర్యంలో అమ్మవారి పల్లకి సేవా ఊరేగింపు పాతబస్తీలో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది.మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గుల్జారాహౌస్,మామాజుమ్లా పాఠక్,చార్‌కమాన్,అగర్వాల్ కళాశాల,రికాబ్‌గంజ్ ప్రాంతాలు మీదుగా తిరిగి మందిరానికి చేరుకుంది.ఈ సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందబస్తు ఏర్పాటు చేశారు.


పాతబస్తీలో చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారి పల్లకి సేవా ఊరేగింపు

## నల్లకుంట పాతరామాలయంకు సిపి సజ్జనార్

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త**
శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరు గుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజా రి, బ్రహ్మశ్రీ కె.అనంతాచార్యులు సిపి సజ్జనార్‌కు తీర్థప్రసాదాలు అందించి స్వామివారి అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ 'నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు మూడువేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాతంగా ముగిసేలా అందరూ సహకరించాలి' అని సజ్జనార్ కోరారు.

## పేదలకు వరంగా సిఎం సహాయ నిధి : రాజేందర్‌రెడ్డి

**నార్సింగి, మార్చి 27 ప్రభాతవార్త :** నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందని మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేం దర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదర్షాకోట్‌కు చెందిన లావేటి శైలజకు రూ.26.వేల సీఎం సహాయ నిధి చెక్కును రాజేందర్‌రెడ్డి అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల సమస్యల పట్ల వేగంగా స్పందిస్తుందని, సంక్షేమా నికి పెద్దపీఠ వేస్తుందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చొరవతో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి సీఎం సహాయ నిధి డబ్బులు వస్తున్నాయని తెలిపారు. ప్రజల కష్టాలను దూరం చేయ డంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చూపుతున్న చొరవనే ఆయనను వరుసగా నాలుగుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించిందన్నారు. ఐదోసారి సైతం రాజేంద్రనగర్ నుంచి అసెంబ్లీకి వెళ్లే నేత ప్రకాశ్‌గౌడ్ మాత్ర మేనని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రచారంలో కాకుండా ప్రజల గుండెల్లో ఉన్న నాయకుడు ప్రకాశ్‌గౌడ్ అని పేర్కొన్నారు.



# అంతా రామమయం!

## నేత్రపర్వంగా..రాములోరి కల్యాణం

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త :** జై శ్రీరామ్..జై జై శ్రీరామ్..అంటూ భక్తుల నినాదాలతో శుక్రవారం భాగ్యనగరం మార్మోగింది. ఇటు సీతారామాలు కల్యాణోత్సవం..అటు శోభాయాంత్ర ఉత్సాహం..వెరసీ..శ్రీరామ నామస్మరణతో సిటీ అంతా మైమరిచిపోయింది. శ్రీరామ నవమి వేడుకలు నగరంలో కన్నుల పండువగా జరిగాయి. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమాన్ దేవాలయాలు ఆధ్యాత్మికతతో పులకించాయి. జానకీ రాముల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి భారీ బందోబస్తు మధ్య ప్రారంభమైన శ్రీరామ నవమి శోభాయాత్ర ఆద్యంతం భక్తులను అలరించింది. సీతారామ్‌బాగ్, బోయిగూడ కమాన్ చైరస్తా, మంగళ్‌హాట్ మీదుగా కొనసాగింది. అలాగే అంబర్‌పేట ఎంసిహెచ్ గ్రౌండ్ నుండి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, బర్కత్‌పుర మీదుగా కాచిగూడలోని వీర్ సవార్కర్ చౌరస్తా వరకు శోభాయాత్ర కొనసాగింది. శోభాయాత్ర రహదారులన్నీ కాషాయమయంగా మారాయి. కాగా..లంగర్‌హౌస్ త్రివేణి సంగం చారిత్రక మఠ దేవాలయం జానకీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.


కోఠిలోని శ్రీ శారదా పీఠంలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తదితరుల దృశ్యం.


అంబర్‌పేట నుండి ప్రారంభమైన శోభయాత్రలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ


శోభయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు


శోభయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్



## పాతబస్తీ జనాలకు తప్పని 'గ్యాస్' కష్టాలు

**- ఎల్‌పీజీ సిలిండర్ల కోసం కస్టమర్లు - సీఎన్‌జీ గ్యాస్ కోసం ఆటోడ్రైవర్లు**


గత కొన్ని రోజులుగా తెరుచుకొని సీఎన్‌జీ గ్యాస్ బంక్, నిలిచిపోయిన ట్యాంకర్లు


పూల్‌బాగ్ వద్ద గ్యాస్‌ట్రాలీ చుట్టూ సిలిండర్ కోసం ఎగబడిన వినియోగదారులు

**చాంద్రాయణగుట్ట, మార్చి 27, ప్రభాతవార్త :**
పాతబస్తీ జనం ఎల్‌పీ జీ, సీఎన్‌జీ గ్యాస్ కోసం ఇంకా నా నా అవస్థలు పడుతున్నారు. ఒకవైపు గ్యాస్‌కు కొరతలేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు స్పష్టం చే స్తున్నా క్షేత్రస్థాయిలో మరోలా ఉం టుంది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేకపోవటం, యుద్ధంపై వస్తున్న వార్తలు సామాజిక మాధ్యమాలలో వైరలవుతూ జనాన్ని భయాందోళనలకు గురి చేస్తున్నాయి. దీనికి తగ్గట్లు ఆయిల్ కంపెనీలు గతం లో ఉన్న నిబంధనలను ఉన్నపళంగా మార్చటం వల్ల ఆప్రభావం గ్యాస్, ఇంధన లోడ్లపై పడింది. బంక్ నిర్వా హకులు లోడ్‌కు ఒకేసారి పెద్ద మొ త్తం చెల్లించలేక చేతులెత్తాశారు. బం క్‌లకు నోస్టాక్ బోర్డులు తగిలించారు. లోపలి విషయం జనాలకు తెలియక మరింత భయపడిపోయి గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోలు, సీఎన్‌జీ బంక్‌లకు క్యూలు కడుతున్నారు. మరోవైపు వంటగ్యాస్ ఎల్‌పీజీ కష్టాలు జనాలకు తీరటం లేదు. గ్యాస్ బుక్ కావటం లేదని కొందరూ, అయినా ఓటిపి రావటం లేదని మరికొందరూ, సిలిండర్ రాలేదని ఇంకొందరూ తమ బాధలను ఎజెన్సీ ఉద్యోగులతో మొరపెట్టుకుంటున్నారు. ఉదయాన్నే ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో ఆయా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయ వద్ద క్యూ కడుతున్నారు. ఎల్‌పీజీ డీలర్లు మాత్రం అంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందని, సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని సర్దిచెబుతున్నారు. జనం వారి మాటలను విశ్వసించటం లేదు. శుక్రవారం పూల్‌బాగ్, మారుతీ షోరూమ్ సమీపంలోని ఒక గ్యాస్ ఎజెన్సీ వద్ద వినియోగదారులు బారులు తీరారు. అక్కడికి గ్యాస్ సిలిండర్లతో వచ్చిన ఆటోట్రాలీని చుట్టుముట్టారు. గ్యాస్ చీటీలను పట్టుకొని నిండు సిలిండర్లు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో ట్రాలీ బాయ్స్ చేసేది లేక లోడ్‌తో ఉన్న ఎల్‌పీజీ సిలిండర్లను నడిరోడ్డుపైనే పంపిణీ చేశారు. ఇక సీఎన్‌జీతో నడిచే గ్యాస్ ఆటోల పరిస్థితి దయ నీయంగా ఉంది. పాతబస్తీలో గల ఎక్కువ శాతం సీఎన్‌జీ బంక్‌లు మూతపడ్డాయి. అక్కడక్కడ తెరిచిన ఒకటి రెండు బంక్‌ల వద్ద ఆటోల భారీ క్యూలైన్లు కనిపిస్తున్నాయి. నాలుగైదు గంటలు లైన్లో ఉంటేగాని గ్యాస్ లభించటం లేదని, గ్యాస్ బంక్ నిర్వాహకుల దయాదాక్షిణ్యాలపై లభిస్తుందని వాపోతున్నారు. గ్యాస్ కొరత కారణంగా ఆటోలను సరిగా తిప్పలేకపోతున్నామని, ఆదాయం తగ్గి కుటుంబ పోషణ, ఆటో అద్దె చెల్లించటం కష్టంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. మాకు ఈ గ్యాస్ కష్టాలు ఎప్పుడు తీరుతాయో, వ్యాపారం ఎన్నడు గాడిలో పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భవనంపై నుంచి దూకి వివాహిత ఆత్మహత్య

**ఎల్.బి.నగర్, మార్చి 27 ప్రభాతవార్త:** భవనంపై నుంచి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి ఇన్స్పెక్టర్ కే. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మన్య శివకుమార్ భార్య మన్య మాధవి అలియాస్ చందన(31) ఈనెల 25వ తేదీన ఉదయం ఆరున్నర గంటల సమయంలో వాళ్లు నివాసం ఉంటున్న భవనం నుంచి దూకి కింద పడింది. భవనంపై నుంచి దూకడంతో చందనకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో వెంటనే ఆమెను స్థానిక కొత్తపేటలోని ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆమె అదే రోజు ఉదయం 10.40 నిమిషాలకు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా చందన మరణానికి భర్త శివకుమార్ కారణమని పేర్కొంటూ మృతురాలి తండ్రి మేడిపల్లికి చెందిన భాశెట్టి శీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## సంజీవరెడ్డి నగర్‌లో డ్రగ్స్ గ్యాంగ్ పట్టివేత

**- రూ. 6 లక్షల విలువైన ఎండిఎంఏ స్వాధీనం**

**సంజీవరెడ్డి నగర్, మార్చి 27, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లో డ్రగ్స్ అక్రమ రవాణాపై పోలీసులు దాడులు కొనసాగిస్తూ మరో విజయాన్ని నమోదు చేశారు. కమిషనర్ టాస్క్ ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్ టీమ్), సనత్ నగర్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు డ్రగ్స్ వినియోగదారులు, ఇద్దరు జువెనైల్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు 60 గ్రాముల ఎండిఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకోగా, దీని విలువ రూ. 6 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం, అరెస్టయిన వారిలో సోంగపు హేమంత్ (23), ముక్కగళ్ల నాగేంద్ర (21) ఉన్నారు. వీరికి మద్యం, గంజాయి, ఎండిఎంఏ వంటి మాదకద్రవ్యాల వినియోగ అలవాటు ఉండగా, చింతల్ ప్రాంతానికి చెందిన సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్యలతో పరిచయం ఏర్పడింది. వారి వద్ద నుండి తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేసి, నగరంలో కస్టమర్లకు అధిక ధరకు విక్రయించే ప్రయత్నంలో ఉండగా పోలీసులు పట్టుకున్నారు.ఈ కేసులో ప్రధాన నిందితులైన సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్య పరారీలో ఉన్నారు. అరెస్టయిన నిందితులను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను తదుపరి విచారణ కోసం సనత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఆపరేషన్‌ను టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యదేందర్, ఎస్ఐ పి. డి. రవిరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు విజయవంతంగా నిర్వహించారు. కమిషనర్ టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షణలో ఈ దాడులు కొనసాగుతున్నాయి.

## యువకుడిపై కత్తి దాడి..నిందితుడు అరెస్ట్

**మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 27 ప్రభాతవార్త :** పాత కక్షలు కారణంగా ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన వ్యక్తినిమైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు.నింధితుడి వద్ద నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం....వాంబేకాలనీకి చెందిన మేస్త్రీ మన్యం కుమారుడు రఘుపతి, లక్ష్మీగూడ వాంబే కాలనీలో నివాసం ఉంటున్న బిహార్‌కు చెందిన వివేక్ మండల్ (22) అన్న దమ్ములు మధ్య వివాదం జరిగింది.ఈనేపథ్యంలో రఘుపతిని హత్య చేయాలని వివేక్ పథకం వేశాడు.వివేక్ కత్తితో రఘుపతి మెడపై దాడి చేయటంతో తీవ్ర గాయాలు అయ్యాయి.ప్రస్తుతం రఘుపతి మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.రఘుపతిని హత్య చేయటానికి ప్రయత్నించిన వివేక్ మండల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జూపార్కుకు కొత్తగా రెండు నామాల కోతులు

**చార్మినార్,మార్చి 27 ప్రభాతవార్త :**


జూపార్కులోని నామాల కోతి

హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని ఎన్‌క్లోజర్‌లోకి రెండు నామాల కోతులను పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్,చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వినయ్‌కుమార్ విడుదల చేశారు.జంతువుల మార్పిడిలో భాగంగా రెండు నామాల కోతులు ఝార్ఖాండ్‌లోని జంషేడ్‌పూర్ జూపార్కు నుంచి వచ్చాయి.హైదరాబాద్ జూలాజికల్ పార్కుకు సంబంధించిన రెండు ఆఫ్రికన్ సింహాలను జం షేడ్‌పూర్ జూపార్కుకు ఇచ్చారు.కాగా నలభై ఐదు రోజుల పాటు జం షేడ్‌పూర్ జూపార్కు నుంచి వచ్చిన 23 నెలలు వయస్సు గల రెండు నామాల కోతులను జూపార్కులో పరిశీలనలో ఉంచారు.నలభై ఐదు రోజులు పూర్తి కావటంతో రెండు నామాల కోతులను పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్,చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్ జూపార్కులోని ఎన్‌క్లోజ ర్‌లోకి విడిచి పెట్టారు.ఈ కార్యక్రమంలో జూపార్కు డైరెక్టర్ డాక్టర్. సునీల్ ఎస్.హీరామత్,జూపార్కు క్యూరేటర్ జె.వసంత, డిప్యూటీ క్యూరే టర్ మురళీధర్,డిప్యూటీ వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ ఎంఎ హకీం, అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి,పిఆర్ఓ మహ్మద్ హనీఫ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.కాగా గతంలో జూపార్కులో ఉన్న రెండు నామాల కోతులు 2013 సంవత్సరంలో చని పోయాయి. ప్రస్తుతం జూపార్కులో జంషేడ్‌పూర్ జూపార్కు నుంచి వచ్చిన 23 నెలలు వయస్సు గల రెండు మగ నామాలు కోతులు ఉన్నాయి.సందర్శకులు ఎంతో ఆసక్తితో నామాల కోతులను తిలకిస్తున్నారు.నామాలు కోతులు పండ్లు,విత్తనాలు, ఆకులు,చిన్న కీటకాలను తింటాయి.నామాల కోతులు దాదాపు ముప్పై సంవత్సరాలు వరకు జీవిస్తాయి.

## ప్రేక్షకులకు నటులకు ప్రత్యక్ష సంబంధం నాటకం



**రవీంద్రభారతి, మార్చి 27 ప్రభాతవార్త :** నాటక ప్రదర్శనలను తప్పకుండా టిక్కెట్‌కొనే చూడాలని ప్రేక్షకుల్లో తలంపు లక్ష్యంతో 32ఏళ్లు ప్రతీనెల ఒక నాటకాన్ని రసరంజని సంస్థ ప్రదర్శిస్తూ ప్రేక్షకుల ఆదరణతో నాటకరంగానికి తనవంతు కృషి చేస్తోందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, రసరంజని అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రసరంజని ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న రసరంజని 33వ వార్షికోత్సవ నాటకోత్సవాలను రమణాచారి ప్రముఖులు రేలంగి నరసింహారావు, ఓలేటి పార్వతీశం, డా. జివిఎస్.రావు, డి.రామకోటేశ్వరరావు, కె.నటరాజ్, మోహనసేనాపతి, అరుణ్ కుమార్, రాధాకృష్ణ తదితరులతో కలిసి రవీంద్రభారతి ప్రధానమందిరంలో జ్యోతిప్రకాసనంచేసి ప్రారంభించారు. మొదట రసరంజని సంస్థకి మూలస్తంభమైన ఏపి మాజీ డీజిపి హెచ్.జె.దొరకు ఘననివాళులర్పించారు. అనంతరం రసరంజని 3రోజుల నాటకోత్సవాల్లో భాగంగా కర్నూలు టి.జి.వి.కళాక్షేత్రం సమర్పణలో అజీజ్ మూలకథ; పల్లేటి లక్ష్మీ కులశేఖర్ మాటలు, పాటలు; కళారత్న పత్తి ఓబులయ్య పద్యరచన, దర్శకత్వం రూపొందిన సామా పద్యనాటకం అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.

## క్యాన్సర్‌పై అవగాహన పెంచడం ముఖ్యం : నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

**జూబ్లీహిల్స్, మార్చి 27, ప్రభాతవార్త:** క్యాన్సర్ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యవసరమని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో డా. బీరప్ప మాట్లాడుతూ, రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఇది ఆందోళన కలిగించే అంశం అన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ముందస్తు గుర్తింపు , ప్రజల్లో అవగాహన, అందరికీ అందుబాటులో ఉండే చికిత్సా సౌకర్యాలు అత్యంత కీలకమన్నారు. కాన్సర్ రిజిస్ట్రీ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డా. సదాశివుడు గుండేటి మాట్లాడుతూ, క్యాన్సర్ నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో భారత వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్)కి చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్ ఎపిడెమియాలజీ విడుదల చేసిన తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్ 2026 పై ప్రత్యేక చర్చ జరిగింది. ఈ ప్రొఫైల్ ఆధారంగా రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాప్తి, ప్రభావం, నియంత్రణ చర్యలపై విశ్లేషించారు. క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రాముఖ్యతను వివరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ కేసుల నమోదు, డేటా విశ్లేషణ, సమగ్ర నివారణ చర్యలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. పీబీసీఆర్ (పాపులేషన్ బేస్డ్ కాన్సర్ రిజిస్ట్రీ) సోర్స్ ఆసుపత్రుల నుంచి డేటా అందించినందుకు సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. శాంతవీర్ ఉప్పిన్, ఎంఎన్జే క్యాన్సర్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా. రఘునాథరావు, అదనపు ప్రొఫెసర్ డా. మెహెర్ లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. రచన చెన్నమనేని , రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మోనిక, పాథాలజిస్టు డాక్టర్ రోషిణి పాల్, డా. ఉప్పలపాటి శ్రీహరి, వివిధ ఆసుపత్రుల వైద్యులు, పీజీ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.


సదస్సులో భాగంగా ఇతర వైద్యులతో కలిసి నివేదికను చూపుతున్న డాక్టర్ నగరి బీరప్ప.




శుక్రవారం రాత్రి నగరంలో కురిసిన వర్షం

## 28, 29 తేదీలలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల స్పోర్ట్స్ మీట్

**సైఫాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:**
ఈ నెల 28, 29 తేదీలలో ఎల్‌బి స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్టేటివ్ స్పోర్ట్స్ మీట్-2026 ఏర్పాట్లును శుక్రవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనరెడ్డి, ఎండి డా.సోనీ బాలాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రిడల పట్ల అవగాహన తీసుకురావడానికి సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు శాసన సభ్యుల క్రిడోత్సవ పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తద్వారా రాష్ట్రంలో క్రిడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 14 ఏళ్ళ తరువాత తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత తొలిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రిడా పోటీల్లో పార్టీ భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసన సభ్యులు, మండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. టగ్ ఆఫ్ వార్, ఫుట్‌బాల్, క్రికెట్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌తోపాటు కొన్ని రిక్రయేషనల్ క్రిడా పోటీలు నిర్వహించబోతున్నామని వివరించారు. అందరికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు.

# రమణీయంగా సీతారాముల కళ్యాణం

-భక్తిపారవశ్యంతో స్వామిని దర్శించుకున్న భక్తులు



శ్రీసీతారాముల కళ్యాణమహోత్స వంలో మాంగళ్యధారణ

**రామాయంపేట, మార్చి 27, ప్రభాతవార్త:** రామాయంపేట పట్టణంలో శుక్రవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారాములు కళ్యాణం కన్నులపండువగా జరిగింది. పట్టణంలోని పొండ చెరువుకట్టపై గత శ్రీకళ్యాణరామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో కళ్యాణంవేడుక ఎంతో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈనెల 25వ తేదీనుండి ప్రారంభమైన ఉత్స వాలలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు కూర్మాచలం శ్రీనివాసాచార్యులు, కూర్మాచలం సత్యనారాయణాచార్యులు, రాఘవాచార్యులతోపాటు హైదరాబాద్‌కు చెందిన ఫణిచార్యులు, రోహిత్, మేడ్చల్‌కు చెందిన ఫణీంద్రాచార్యులు, కామారెడ్డికి చెందిన శ్రీనివాసమూర్తి చార్యుల వైదికబృందం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలతో నిత్యం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం లో 11.58 గంటలకు శ్రీసీతారాములు కళ్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయకమిటీ పట్టువస్త్రాలు, ముత్యాలతలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారిని పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కాగా కళ్యాణ వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ బాలరాజు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు నవాత్ ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు పటేరి రవీందర్, నక్క సిద్దరాములు, కన్నాపురం ఈశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నవాత్ రాజేంద్రప్రసాద్, పటేరి రాము, నవాత్ మహేష్ ప్రధానకార్యదర్శి మధునాల స్వామిగౌడ్, కోశాధికారి నవాత్ నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శులు సరిదె వెంకటి, నవాత్ ప్రసాద్, సాంగని నాగరాజులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే...**

స్వామివారి కళ్యాణం అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయకమిటీ ఆహ్వానంపలికి శాలువాతో సత్కరించారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

## రంగంపేటలో సీతారాముల కళ్యాణమహోత్సవం



సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**కొల్చారం, మార్చి 27, ప్రభాతవార్త:** కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన శ్రీసీతారాముల కళ్యాణమహోత్స వం అంగరంగవైభవంగా జరిగింది. ఈసందర్భంగా డిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎంపిపి అరిగే రజినిరమేష్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామంలోని స్థానిక హనుమాన్ మందిరంవద్ద రంగురంగులపూలతో, పచ్చనితోరణాలతో అందంగా అలంకరించిన కళ్యాణమండపంలో వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల ఉత్స వవిగ్రహాలను డప్పుచప్పుళ్ల మధ్య, భక్తిగీతాలు, శ్రీరామ నామస్మరణతో ఊరేగింపుగా మండపానికి తీసుకువచ్చారు. అనంతరం అరిగే రజిని రమేష్, సర్పంచి అరిగే స్వర్ణలతవిజయ్‌కుమార్ స్వగృహంనుండి తలంబ్రాలు సమర్పించగా, ముప్పిడి కృష్ణ స్వగృహం నుండి పూసే మట్టలను తీసుకువచ్చి, గ్రామ పురోహితుడు కుమార్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య కళ్యాణవేడుకలను కన్నులపండుగగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ మహిళలు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్స వ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఉత్స వ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరామనారాయణ క్షేత్రంలో కన్నులపండువగా శ్రీసీతారాముల కళ్యాణం



సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తున్న సంగీతరామ్‌చందర్

**నర్సాపూర్, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామనవమిని పురస్కరించుకొని నర్సాపూర్ మండలపరిధిలోని లింగాపూర్ గ్రామపంచాయతీలోని లాలుతాండలో వెలసిన శ్రీరామనారాయణ క్షేత్రంలో ఆలయధర్మకర్త సంగీతరామ్‌చందర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగవైభవంగా సీతారాములకళ్యాణం ఘనంగా నిర్వహించారు. కళ్యాణమహోత్స వానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి హాజరై శ్రీసీతారాముల కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణానికి పరిసరగ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీసీతారాముల కళ్యాణం తిలకించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

**కౌన్సిలర్ రాజు లక్ష్మి(బుల్లెట్ రాజు) ఆధ్వర్యంలో అన్నదానం..**

శ్రీరామనారాయణ క్షేత్రంలో కళ్యాణానికి హాజరైన భక్తులకోసం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ రాజు లక్ష్మి(బుల్లెట్ రాజు) ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం కళానిలయం నృత్య అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులచేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో ఆలయసిబ్బంది శంకర్‌నాయక్, విజేత స్కూల్ పిఈటి కృష్ణ, సంతోష్‌కుమార్‌నాయక్, కళానిలయం డాన్స్ నిర్వాహకురాలు కవిత, చిన్నారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా సీతారామ కళ్యాణోత్సవం



కళ్యాణోత్స వంలో పాల్గొన్న మహిళలు

**వెల్దుర్తి, మార్చి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీవిఠలేశ్వర ఆలయంలో శుక్రవారం సీతారాముల కళ్యాణం భక్తులు నిర్వహించారు. విగ్రహాలను స్థానిక అంగడిపేట హనుమాన్ దేవాలయం నుండి భారీ డప్పుచప్పుళ్లతో స్థానికసర్పంచి ఆదర్శ పుట్టు విఠలేశ్వర ఆలయంలో జరిగే కళ్యాణోత్స వానికి తెచ్చారు. అనంతరం అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీసంఖ్యలోపాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం విఠలేశ్వర ఆలయం నుండి భారీర్యాలీ నిర్వహించారు. బోనాల ఊరేగింపు రథోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు.

# ప్రాణాలైనా అర్పిస్తాం..చర్చి ఆస్తులను కాపాడుకుంటాం

**చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు**



మాట్లాడుతున్న మెథడిస్ట్ చర్చి పరిరక్షణ కమిటీ అధ్యక్షులు శాంతికుమార్, వినయ్ కుమార్

**జహీరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని అల్లీపూర్‌లో జాతీయ రహదారి పక్కన ఎంఆర్‌హెచ్‌ఎస్ మెథడిస్టు సెంట్రల్ చర్చి ఆస్తులను కాపాడుకునేందుకు తమ ప్రాణాలను అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని రెవరెండ్ బిజీ గార్డెన్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం సెంట్రల్ చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షులు శాంతికుమార్, ఎన్.విజయ్‌కుమార్ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరికి విద్యను అందించేందుకు 1930 లో రెవరెండ్ బీజి గార్డెన్ దొర జహీరాబాద్‌లో ఎంఆర్‌హెచ్ పాఠశాలను, వసతి గృహాన్ని ఏర్పాటు చేసి ఎందరో పేద విద్యార్థులు విద్యను అందుకునేలా చేసి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా చేశారని గుర్తు చేశారు. చర్చి ఆస్తులను హైదరాబాద్‌లోని మెథడిస్ట్ ట్రస్టు సభ్యులు బిషప్ కొంతమంది వ్యక్తులకు లీజు పేరిట అమ్మకానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మెథడిస్ట్ ట్రస్టు పరిధిలోని ఇతర ప్రాంతాల్లోని ఆస్తులను,పాఠశాలను మూసేసి లీజు పేరిట అమ్మేశారన్నారు. జహీరాబాద్‌లోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చి పరిధిలోని 65 ఎకరాల విలువైన స్థలాలను లీజు పేరిట బిషప్, మరికొందరు సభ్యులు అమ్మేసేందుకు కుతంత్రాలు పన్నుతున్నారని మండిపడ్డారు. గత ఆదివారం హైదరాబాద్ నుంచి బిషప్ గుండాలను, బౌన్సర్లను చర్చి వద్దకు చేరుకుని భక్తులపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్న ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాల మూతపడేలా కుట్రలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చర్చి ఆస్తులను కాపాడేందుకు రెవరెండ్ బీజీ గార్డెన్ మెమోరియల్ సొసైటీగా ఏర్పాటు చేసి సంస్థ ద్వారా పాఠశాల, చర్చిని పరిరక్షిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.

సమావేశంలో కమిటి పరి రక్షణ సభ్యులు బి దేవదాస్, ఇజ్రాయిల్ బాబి, జోసఫ్ స్టాలిన్, ప్రమోద్, వి.ఉల్లాస్, డాక్టర్ ఎన్ జనార్ధన్,మోజెస్, సత్యానందం జేమ్స్ పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

**పెద్దశంకరంపేట, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామనవమి సందర్భంగా పెద్దశంకరంపేటలోని రామాలయంలో సీతారాముల కళ్యాణమహోత్స వం అత్యంతవైభవంగా నిర్వహించారు. వేడుకలకు భక్తులు భారీసంఖ్యలో హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాములకళ్యాణం నిర్వహించారు. వేడుకను చూసేందుకు గ్రామస్థులు, పరిసరప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు స్వచ్ఛందంగా సేవలు అందించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ జంగం రేణుకశ్రీనివాస్, ఆలయకమిటీ అధ్యక్షులు గుజ్జరి కనక రాజు, మురళి పంతులు, కందుకూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణోత్స వంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి...**

పెద్దశంకరంపేటలోని రామాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్స వ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, నాగ గౌడ్, రాయిని మధుసూదన్, మురళి పంతులు, సంగమేశ్వర్, పెరుమాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయాన్ని అధునాతనంగా తీర్చిదిద్దుతా

**యాచారం,మార్చి 27, ప్రభాతవార్త:** నక్కర్త హనుమాన్ దేవాలయాన్ని అధునాతనంగా తీర్చిదిద్దుతానని నూతన ఆలయ కమిటీ చైర్మన్ సిందం అంజయ్య అన్నారు. యాచారం మండల పరిధిలోని నక్కర్త మేడిపల్లి గ్రామంలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవనం నవమి పురస్కరించుకొని ఉత్స వాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సర్పంచ్ ముచర్ల సుగుణ సంపత్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా సిందం అంజయ్య, వైస్ చైర్మన్‌గా బండ రాజు, ప్రధాన కార్యదర్శిగా కొంగళ్ల యాదగిరి, సమన్వయకర్తగా కలకొండ అంజయ్య, కోశాధికారిగా వంగూరి శ్రీశైలంలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. యాచారం మండలంలోని నకర్త మేడిపల్లిలో అతిపెద్ద గ్రామ పంచాయతీ అని గ్రామంలో ఉన్న ఆలయాల్లో ఆంజనేయస్వామి ఆలయం అతి పురాతనమైనది అన్నారు. ఆలయాన్ని అధునాతనంగా తీర్చిదిద్ది ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తమపై నమ్మకం విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన గ్రామ పెద్దలకు సర్పంచ్‌కి శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వంగూరి జంగయ్య, సింధం రవి, పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**జవహర్ నగర్, మార్చి 27, ప్రభాతవార్త:** జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మదర్ థెరిస్సా వికలాంగుల కాలనీలో శ్రీరామనవమి సందర్భంగా బూడిద శ్రీకాంత్ జ్ఞాపకార్థంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కారింగుల నిహారిక వెంకట్ గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల జ్యోతి శంకర్ గౌడ్ తదితరులు ప్రారంభించారు.మొదటి రోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలు అవసరమని నాయకులు పేర్కొన్నారు.



శ్రీరామ కళ్యాణోత్స వంలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

**మెదక్, మార్చి 27, ప్రభాతవార్త :** మెదక్ శ్రీకోదండ రామాలయంలో కల్యాణోత్స వం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. అర్చకులు కల్యాణ క్రతువు జరిపారు. వేలాది మంది భక్తులు హాజరయ్యారు. కల్యాణోత్స వం అనంతరం ఒడి బియ్యం సమర్పించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా టౌన్ సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్స వంలో పాల్గొన్నారు. శ్రీరాముడి అనుగ్రహంతో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. వెంట మున్సిపల్ ఛైర్ పర్సన్ కానుగు రాధికా భూపతిరాజ్, వైస్ ఛైర్మన్ నరేష్ గౌడ్, మాజీ ఛైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు శివ రామకృష్ణ, హరిత, పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్, నాయకులు ముత్యంగౌడ్, మహేష్ తదితరులున్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదే వేందర్ రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు.మెదక్ జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులు రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షి స్తూ, ఆయన గుణగణాలను అందరూ అలవర్చుకోవాలని సూచించారు. వెంట తిరుపతి రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, కౌన్సిలర్లు మాయ గంగామణి మల్లేశం, కొట్టాల లలిత విశ్వం, నాయకులు మాణిక్యరెడ్డి, గడ్డమీద కృష్ణ గౌడ్, ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఎస్పి డి. వి. శ్రీనివాసరావు కోదండ రామాలయం సన్నిధిలో నిర్వహించిన కల్యాణోత్స వంలో పాల్గొని ప్రత్యేక పూజలునిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పగడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంట మెదక్ టౌన్ సీఐ మహేష్, ఎస్ఐ విట్టల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, మార్చి 27, ప్రభాతవార్త:** గూడు లేని నిరుపేదలకు గూడు కల్పించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం గిర్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన హరిజన్ సంగీత వెంకటప్ప ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యాక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్దిదారులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నాడు, నేడు ఇందిరమ్మ ఇళ్ళను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అటువంటి ఇందిరమ్మ ఇళ్ళలో సిరిసంపదలు కలిగి లబ్దిదారులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిలువ నీడ లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళతో ఎంతో లబ్ది చేకూరుతుందని అన్నారు. లబ్దిదారులు సంగీత వెంకటప్ప మాట్లాడుతూ తమ సొంతింటి కలను సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తంచేస్తూ సిఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరాం నాయక్, ఏబ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు, తాండూరు మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ పట్లోల్ల బాల్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టు ఆనకట్టకు మరమ్మతు పనులు ప్రారంభం

- -18 కోట్లతో ప్రాజెక్టుకు ఇరువైపుల పటిష్టం
- -6కిలో మాటర్ల మేర 2 లేయర్లు రివిట్‌మెంట్
- -నీటి మట్టం మరింతగా తగ్గితేనే కొనసాగనున్న పనులు



సింగూరు ప్రాజెక్టులో మరమ్మతు పనులు కొనసాగుతున్న దృశ్యం

**చౌటూరు, మార్చి 27, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలోని ఏకైక భారీ నీటి పారుదల ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు ఆనకట్ట మరమ్మతుకు రూ. 16 కోట్లు మంజూరుకావడంతో పనులు షురువయ్యాయి. నీటి అలల ఉధృతికి 2023లో ప్రాజెక్టుకు ఎడమ వైపున జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎగువ భాగంలో ఆనకట్ట రివిట్‌మెంట్ కుంగిపోయిన విషయం పాఠకులకు విధితమే. గత సంవత్సరం మే నెలలో ప్రాజెక్టును ఆనకట్టను డ్యాం సేఫ్టీ అధికారులు సందర్శించి 800 మీటర్ల మేరకు లోపలి భాగంలో ఆనకట్టకు అమర్చిన రివిట్‌మెంట్ కుంగిపోయిందని, ప్రాజెక్టు ప్రమాదకర స్థాయిలో ఉందంటూ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీంతో ప్రభుత్వం మరమ్మతులకుగాను నిధులు మంజూరు చేసింది. ప్రాజెక్టుకు ఇరువైపుల 6 కిలో మీటర్ల దూరం ఆనకట్టకు అమర్చిన రాతి కట్టడం (రివిట్‌మెంట్)ను పూర్తిగా తొలగించి, కొత్తగా నిర్మించడం, దెబ్బతిన్న రేయిలింగ్ గోడను పునర్ నిర్మించేందుకు 22 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. టెండర్ పనులు దక్కించుకున్న హిమసాయి కన్‌స్ట్రక్షన్ మరమ్మత్తు పనులకు పరుగులు పెట్టిస్తున్నారు. ప్రాజెక్టులో 2 నెలల క్రితం 16 టీఎంసీల నీటి నిల్లలు ఉండటంతో పనులకు ఆటంకం కలుగుతుండటంతో 8 టీఎంసీల నీటిని దిగువన ఉన్న మంజీరా జలాశయ, ఘనపురం, నిజాంసాగర్ ప్రాజెక్టులకు వదిలేయడంతో ప్రాజెక్టులో ప్రస్తుతం 8 టీఎంసీల నీటి నిల్వాలు ఉన్నాయి. ప్రాజెక్టుకు ఎడమ వైపు గల నీటి పారుదల శాఖ అతిథిగృహం నుంచి పనులను ప్రారంభించారు.

**ఆనకట్ట పటిష్టతకు రెండు లేయర్ల రివిట్‌మెంట్...**

ప్రాజెక్టు ఆనకట్ట పటిష్టతంగా ఉండేందు నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఆనకట్టకు అమర్చిన సింగిల్ లేయర్ రివిట్‌మెంట్‌ను పూర్తిగా తొలగించి డబుల్ లేయర్లుగా అమర్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఆనకట్టకు మట్టిని తొక్కించి, ఇసుక, 10, 20, 40 ఎంఎం కంకర్లను వాటిపూ రెండు లేయర్లు రివిట్‌మెంట్‌ను అమర్చుతున్నారు.

**నీటి మట్టం తగ్గితేనే పనులు ముందుకు...**

ప్రాజెక్టులో 8 టీఎంసీల నీటి మట్టం నిల్వ ఉంది. నీటి పారుదల శాఖ అతిథి గృహం నుంచి కిలో మీటరు వరకు నీటి నిల్వాలు తగ్గాయి. ఎడమ వైపు ఆనకట్ట 3 కిలో మీటర్లు, కుడి వైపున 3 కిలో మీటర్లు ఉంది. ఎడమ వైపు కిలో మీటరు దూరం వరరకు పనులు చేపట్టేందుకు ఇబ్బందులు పాడాల్సిన పనిలేదు.ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల వరకు 2 కిలో మీటర్ల దూరరం పనులు చేపట్టాల్సి ఉంటుంది. మొదట్లో ఎడమ వైపున 800 మీటర్లు రివిట్‌మెంట్ కుంగిపోయి ఉంటుందనుకున్న అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రెండు వైపుల ఆనకట్ట 6 కిలో మీటర్లు రివిట్‌మెంట్ దెబ్బతిన్నట్లుగా నిర్ధారించారు. ప్రాజెక్టులో నీటి మట్టం మరింతగా తగ్గిస్తేనే పనులు వేగంగా జరుగుతాయంటున్నారు.

**మంత్రుల ఉన్నత స్థాయి సమీక్షలు...**

సింగూరు ప్రాజెక్టు ఆనకట్ట మరమ్మతు పనుల పురష్కరించుకుని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా, నీటి పారుదల శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షలు చేస్తున్నారు. ఆనకట్ట మరమ్మత్తు పనులను శరవేగంగా చేపట్టి వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి చేయాలంటూ అధికారులను మంత్రులు ఆదేశించారు. అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా ఎప్పటికి అప్పుడు సమన్వయం చేస్తూ పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రాజెక్టు ఆనకట్ట కింద క్రాప్ హాలిడే ప్రటించింది. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికల్లా పనులు పూర్తి చేసి సాగుకు సింగూరు జలాలను విడుదల చేసేందుకు ప్రభుత్వం పనుల నిర్వహణలో మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## బయ్యారంలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**గజ్వేల్ టౌన్, మార్చి 27 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ మైసని కళ్యాణి ప్రశాంత్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బయ్యారం గ్రామ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవడానికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బిసిడి మహిపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు మద్దూరి రవీందర్‌రెడ్డి, నర్సారెడ్డి, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**హనుమ తండాలో...**



సీసీ రోడ్ల పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**ధూళిమిట్ట, మార్చి 27,ప్రభాతవార్త :** మండలంలోని హనుమ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పంతులు తండాలో 4వ వార్డులో సీసీ రోడ్డు పనులను శుక్రవారం సర్పంచ్ బాధావత్ లలిత శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ లలిత శ్రీనివాస్,ఉప సర్పంచ్ మోహన్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జాటోతు వినోద్ నాయక్, వార్డు మెంబర్స్ బానోతు రాజు,ఇస్లావత్ భీమ,భూక్య మానిక,తండా ప్రజలు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి

-మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



మండల విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎం.శ్రీనివాస్

**గజ్వేల్, మార్చి 27 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో రైతులకు, గృహ అవసరాలకు సంబంధించి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం అహ్మదీపూర్‌లోని సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి మండల విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా లో–వోల్టేజీ సమస్య ఉత్పన్నం కావడం వల్ల రైతులకు యాసంగి పంట సీజన్ కావడం బావుల వద్ద మోటార్లు కాలిపోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నిత్యం గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ సరఫరాలో కూడా సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ స్తంభాలకు థర్డ్ వైర్ లాగటం జరిగిందని, ఇంకా 30 స్తంభాలకు వైర్ అవసరం ఉందని, అది కూడా పూర్తి చేయాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందివ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ కో-ఆప్షన్ అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామొద్దీన్, ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు సంపత్‌రెడ్డి, కుర్మ రాములు, రాజు, కె.రాములు, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, రైతులు శ్రీను, కిష్టారెడ్డి, రాములుగౌడ్, రాజిరెడ్డి, బాలయ్య, నరేష్, రమేష్, కరుణాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సత్యపాల్, యాదయ్య, స్వామిరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామాలయంలో నరోత్తం పూజలు

**జహీరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని మండల పరిధిలోని కొత్తూర్(బి)లోని శ్రీకోదండ రామాలయాన్ని శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం దర్శించుకుని పూజలు నిర్వహించారు. నరోత్తం వెంట జి మల్లేశం, చెంగల్ జైపాల్, పవన్ రాథోడ్, మిథున్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం

**హవేళీఘనపూర్, మార్చి 27, ప్రభాతవార్త:** వేసవిలో అంబలి, చలివేంద్రం కేంద్రాలు బాటసారులకు, ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని బచ్చు సతీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హవేళీఘనపూర్‌లోని బచ్చు జగదీశ్వర్ ఆధ్వర్యంలో శ్రీరాజరాజేశ్వర బాయిల్డ్ రైస్‌మిల్ వద్ద అంబలి, చలివేంద్రం కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నోముల శ్రీకాంత్, కృష్ణ, సాయిబాబ, వెంకటేష్, రాజశేఖర్, సత్యసాయి సేవాసమితి సభ్యులు, నగేష్, వెంకటేశ్ గౌడ్, రాధాక్రిష్ణ, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## కనుల పండువగా సీతారాముల కళ్యాణం

**జహీరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీ రామ నవమి వేడుకలను మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం కనుల పండువగా జరుపుకున్నారు. ఆలయానికి గ్రామస్థులతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని సీతా రాములు, ఆంజనేయస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉత్స వాలను పురష్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిలో శ్రీ సీతారాముల కళ్యాణోత్స వాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరామ నవమి వేడులు ప్రశాంతంగా ముగిసేలా జహీరాబాద్ రూర్ ఎస్ఐ కాశీనాథ్ తన సిబ్బందితో కలిసి నిఘా ఏర్పాటు చేశారు.



కొత్తూర్ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణం దృశ్యం

# నేత్రపర్వంగా శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవం


శ్రీరాముడిని దర్శించుకున్న పులిమామిడి రాజు


చౌటకూరులో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం


హద్నూర్‌లో కళ్యాణంలో పాల్గొన్న భక్తులు


అల్లాదుర్గంలో సీతారాముల కళ్యాణోత్సవం


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


కౌడిపల్లిలో ఘనంగా సీతారాముల కళ్యాణం


విగ్రహాలను తరలిస్తున్న మాజీ కార్పొరేటర్ దంపతులు


సిర్గాపూర్‌లో శ్రీసీతారాముల పల్లకీసేవ


కళ్యాణంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు


మిర్జాపల్లిలో పూజల్లో ఎమ్మెల్యే రోహిత్‌రావు


కూచన్‌పల్లిలో సీతారాముల కళ్యాణం


వెల్పుగొండలో సీతారాముల కళ్యాణోత్సవం

**సదాశివపేటలో...**

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలోని శ్రీరామకళా మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పులిమామిడి రాజు పాల్గొని సీతారాముల దివ్య ఆశీస్సులు పొందారు. సొంతనిధులతో తీసుకువచ్చిన ముత్యాలను శ్రీరాముని పాదాలచెంత ఉంచి వాటికి పూజాకార్యక్రమాన్ని నిర్వహించి సాయంకాలం వాటిని 12వ వార్డు ప్రజలకు ఇంటింటికీ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు, అభిమానులు పాల్గొన్నారు.

సదాశివపేటలోని శ్రీరామకళామందిరంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. బిఆర్‌ఎస్‌నాయకులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్, బిఆర్‌ఎస్ పట్టణ ప్రధానకార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, ఆలయకమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు, అభిమానులు పాల్గొన్నారు.

**చౌటకూరులో...**

**పుల్‌కల్/చౌటకూరు, మార్చి 27, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలను గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని కళ్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు. పుల్‌కల్‌లో నిర్వహించిన శ్రీసీతారాముల కళ్యాణోత్సవానికి రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**చౌటకూరు మండలంలో...**

మండల కేంద్రమైన చౌటకూరుతో పాటు ఆయా గ్రామాల్లో శ్రీరామనవమివేడుకలను కనులపండువగా జరుపుకున్నారు. శ్రీసీతారాముల కళ్యాణోత్సవంలో దంపతులు పాల్గొని క్రతువు నిర్వహించారు. మండలపరిధిలోని చక్రియాలలో శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయంలో శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని ఆలయకమిటీ చైర్మన్ భానూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపసర్పంచి ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసచారి, మాజీసర్పంచి దప్పూరి శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్‌లో...**

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన న్యాల్‌కల్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను రమణీయంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో వేద బ్రాహ్మణులు గిరీష్‌రావు జోషి వేదమంత్రాలు వల్లిస్తుంగా శ్రీసీతారాముల కళ్యాణం కమనీయంగా నిర్వహించారు. హద్నూర్‌లో జరిగిన వేడుకలకు ఎస్‌ఐ దోమ సుజిత్, గ్రామ సర్పంచి ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచి సామల ఉమారాచన్నలు హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకించి ప్రసాదాన్ని స్వీకరించారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, మార్చి 27, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన అల్లాదుర్గంతోపాటు మండలంలోని ఆయాగ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తులు కనులపండువగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీలాం కోట ప్రవీణ్ శర్మ వేదమంత్రాలు వల్లిస్తూ శ్రీరాముల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలపరిధిలోని ముస్తాపూర్ రామాలయంలో, వేంకటేశ్వర ఆలయంలో, చిల్వేర్‌లో రామాలయంలో, బహిరన్ దిబ్బలో రామాలయంలో సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

**కౌడిపల్లిలో...**

**కౌడిపల్లి, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకోని మెదక్‌జిల్లా కౌడిపల్లి మండలకేంద్రంలోని శ్రీ అభయరామాలయంలో శ్రీనీలమేఘశ్యాముడు, సీతాదేవిల కళ్యాణోత్సవ వేడుకలు రమణీయంగా నిర్వహించారు. మండలంలోని రాజీపేట, వెల్మకన్నె, రాయిలాపూర్, కన్నారం తదితర గ్రామాల్లో సైతం శ్రీరామనవమి సందర్భంగా నేత్రపర్వంగా శ్రీసీతారాముల కళ్యాణోత్సవం జరిపించారు. కళ్యాణోత్సవంలో హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుముల ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి కుర్మ శేఖర్ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ చిలుముల సుహాసినిరెడ్డి, నాయకులు పైడి శ్రీధర్ గుప్త, చంద్రం దుర్గాగౌడ్, కౌడ శ్రీనివాస్‌గుప్త, ముంబాయి లక్ష్మణ్‌యాదవ్, గోల్ల గోపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ముదిరాజ్ మటూరి శాకయ్య, పురుషోత్తం, పిస్కే నర్సింలు, పిస్కే శేట్టయ్య, పుండరీకంగౌడ్, మహమ్మద్‌నగర్ సొసైటీ సిఈవో దుర్గయ్యగౌడ్, కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అధ్యక్షులు పోన్నం మనోహర్‌గౌడ్, సార రామాగౌడు, ప్రముఖులతోపాటు కౌడిపల్లి, కొల్చారం, చిలిపిచెడ్ మండలాలకుచెందిన సర్పంచులు, ఆలయ కమిటీ సభ్యులు ఉడుత వెంకటేశం, ఉడుత మురళి, నాండ్ల వెంకటేశంగుప్త, దర్జి చంద్రం, పెంచలయ్య, మక్బూల్, సత్యనారాయణగౌడ్, రమేశ్‌గౌడ్, చంద్రం కిషోర్‌గౌడ్, చంద్రం వెంకటేశంగౌడ్, వీరేశం గౌడ్, కాలేరు శ్రీనివాస్, సుధాకర్ మెకానిక్, దొంత గౌరప్ప, చిలుముల నర్సింహ్మారెడ్డి, విశ్వంభరస్వామి, జగ్గంపేట మన్తప్ప, బాన్సువాడ మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచి శ్వేతా మల్లికార్జున్‌గౌడ్, వార్డుసభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో...**

**ఆలయానికి విగ్రహాలు తరలించిన మాజీ కార్పొరేటర్ దంపతులు...**

**రామచంద్రాపురం, మార్చి 27, ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్‌లోని శివఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ శాశ్వత అధ్యక్షులు వెన్నవరం రాజేశ్వర్‌రెడ్డి గృహం నుంచి శ్రీరాముల విగ్రహాలను పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి తన ధర్మపత్ని భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డితోకలసి ఆలయానికి తరలించి కళ్యాణమహోత్సంలో పాల్గొని వివాహక్రతువును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి మాజీ ప్రోటెంచైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారతీనగర్ డివిజన్‌పరిధిలోని బొంబాయి కాలనీలోని రామాలయం, కన్యాకా పరమేశ్వరి ఆలయాల్లో, మ్యాక్‌సొసైటీలోని అన్నమయ్య కాలనీ, ఓల్డ్ ఎంఐజి ప్రాంతాల్లో, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురం, అశోక్‌నగర్, మయూరినగర్, జ్యోతినగర్, కాకతీయనగర్ ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**సిర్గాపూర్‌లో...**

**సిర్గాపూర్, మార్చి 27, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన సిర్గాపూర్‌లో శుక్రవారం శ్రీ రామనవమి వేడుకలను రమణీయంగా జరుపుకున్నారు. రామాలయంనుంచి పురవీధుల గుండా ఆంజనేయస్వామి ఆలయం మీదుగా అందంగా అలంకరించిన పల్లకీలో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించుకుని భారీశోభాయాత్ర (పల్లకీసేవ) నిర్వహించారు. ఆనవాయితీని అనుసరించి కళ్యాణ్‌రావుపటేల్ ఆధ్వర్యంలో రాములోరికి పాటలను ఆలపిస్తూ తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

**నారాయణఖేడ్, మార్చి 27, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని అతి పురాతనమైన శ్రీరామమందిరంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొని సీతారాముల వారికి నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ల అనుపమసంజీవరెడ్డి దంపతులు ప్రత్యేకపూజలు జరిపించారు. పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, నగేష్‌కుమార్‌శెట్కార్ దంపతులు, సాగర్‌శెట్కార్, దారం శంకర్, బాణాపురం రాజు, రుక్మిణి గోపాల్‌రెడ్డి, షారుఖాన్, వివేకానంద, మహేష్‌చౌహన్, మైతాబ్, సుబుర్, కౌన్సిలర్లు, తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేటలో...**

**చిన్నశంకరంపేట, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామనవమి సందర్భంగా మండలవ్యాప్తంగా సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఎస్. కొండాపూర్, మిర్జాపల్లి, చిన్నశంకరంపేట పట్టణంలో జరిగిన సీతారాముల కళ్యాణమహోత్సవంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయాగ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణవేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కూచన్‌పల్లిలో...**

**హవేళీఘనపూర్, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామనవమి సందర్భంగా హవేళీఘనపూర్ మండలవ్యాప్తంగా శ్రీసీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కూచన్‌పల్లిలో దేవాలయంలో స్వామివారి కళ్యాణమహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

**టేక్మాల్ మండలంలో...**

**టేక్మాల్, మార్చి 27, ప్రభాతవార్త:** టేక్మాల్ మండల పరిధిలోని టేక్మాల్, బొడ్మట్‌పల్లి గ్రామాలతో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. వెల్పుగొండగ్రామంలో శ్రీరామాచలంగుట్టపై సీతారాముల కళ్యాణం జరిగింది. గ్రామంలోని వీధులనుండి రామాచలంగుట్టపైకి బోనాలు, గండ జ్యోతులు, ఊరేగింపుగా తీసుకెళ్లారు. కళ్యాణానికి వేలసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో పలుసాంస్కృతిక నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. సాయంత్రం సీతారాముల పల్లకీసేవను ఊరేగింపుగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భానుప్రకాష్, ఆలయకమిటీ భక్త బృందం, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 30 ఏళ్లుగా కట్టెల పొయ్యిపైనే ఇడ్లీ, దోశ

### -పొగకు అలవాటుపడ్డాము అంటున్న వెంకటసుబ్బమ్మ


కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న వెంకటసుబ్బమ్మ

**సదాశివపేట, మార్చి 27, ప్రభాతవార్త:** కట్టెల పొయ్యిపైన తయారుచేస్తున్న టిఫిన్స్ రుచిగా ఉంటాయని హోటల్ నిర్వాహకురాలు వెంకటసుబ్బమ్మ తెలిపారు. సదాశివపేటలోని పిఎస్ ఎంఎల్ కాలనీ వద్ద గత 30 సంవత్సరాలుగా హోటల్ నిర్వహిస్తున్నామని అన్నారు. మొదట మా అమ్మగారు హోటల్ నిర్వహించారని అప్పటినుండి కూడా కట్టెలపొయ్యిపైనే ఇడ్లీ దోశ, టిఫిన్ తయారుచేసేవారని వెంకటసుబ్బమ్మ అన్నారు. మా అమ్మగారి తర్వాత హోటల్ నిర్వహణలో గత 20 సంవత్సరాలుగా అదే కట్టెలపొయ్యిపైనే నిర్వహిస్తున్నారని ఆమె అన్నారు. దీనివల్ల పొగ వస్తున్నప్పటికీ అది మాకు అలవాటైపోయిందని ప్రస్తుతము కట్టెలపొయ్యి వలన నాకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. ప్రస్తుత ఈ తరుణంలో ఇంటిలోకాని హోటల్స్‌లోకాని కట్టెలపొయ్యి వాడాలంటే వారికి పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. మరి ఆనాటి నుండి వాడుతున్న వారి పనితనానికి సెల్యూట్ కొట్టాల్సిందే.

## కన్నులపండువగా సీతారాముల కల్యాణం


సీతారాముల కళ్యాణంలో మాంగళ్యధారణ చేస్తున్న పురోహితులు

**పాపన్నపేట, మార్చి 27, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన పాపన్నపేట, లక్ష్మీనగర్, గాజులగూడెం, మల్లంపేట, నాగ్సాన్‌పల్లి గ్రామాలలో శ్రీసీతారాముల కల్యాణం శోభాయమానంగా ఘనంగా నిర్వహించారు. ఏడుపాయల దేవస్థానం తరపున సీతారాముల కళ్యాణనికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయ అధికారులు, అర్చకులు శంకర్‌శర్మ, సూర్య, శ్రీనివాస్‌లకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక సర్పంచి పావని నరేందర్ గౌడ్, గజవాడ రాజేశ్వర్, మాజీసర్పంచి గురుమూర్తిగౌడ్, దంపతులు సీతారాముల కళ్యాణం నిర్వహించారు. పురోహితులు విశ్వనాథశర్మ మంత్రోచ్చారణలమధ్య జరిగిన కళ్యాణానికి మహిళలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో చేరుకొన్నారు. అనంతరం తూర్పు రాజారాం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలకేంద్రమైన పాపన్నపేటలో వేంకటేశ్వరస్వామికి బండ్ల ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**చిలిపిచెడ్, మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో 4వ వార్డుమెంబర్ ఇందిరా సుధాకర్ గౌడ్ సహాయంతో ఫైజాబాద్ గ్రామపంచాయతీ, బస్టాండ్‌వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచి రాములు, ఉపసర్పంచి శ్రీకాంత్ రెడ్డి, మాజీసర్పంచి మనోహర నర్సింహారెడ్డి, వార్డుమెంబర్లు స్వప్న కుమార్, శ్రీకాంత్, గ్రామస్థులు నర్సింహారెడ్డి, జైపాల్, రవి, ముత్తయ్య జగన్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసరస్వతీ విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న వక్త చంద్రశేఖర్ ఆచార్య

**నారాయణఖేడ్, మార్చి 27, ప్రభాతవార్త:** దేశ సంస్కృతీసంప్రదాయాలను విద్యద్వారానే భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో శ్రీసరస్వతి విద్యాపీఠం ఆవిర్భవించిందని, విద్యాపీఠ ఆవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య వక్త చంద్రశేఖర్ ఆచార్య ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆచార్య రూ.11,000లను సేవానిధిగా పాఠశాలకు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అర్థం చంద్రశేఖర్, సహకార్యదర్శి శివరాజ్, గోవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు, ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థిబృందం పాల్గొన్నారు.

## సిద్ధివినాయకుడిని దర్శించుకున్న అదనపు ఎస్పీ


సిద్ధివినాయకుడిని దర్శించుకుంటున్న అదనపు ఎస్పీ మహేందర్

**న్యాల్‌కల్, మార్చి 27, ప్రభాతవార్త:** మండలపరిధిలోని రేజింతల్‌గ్రామశివారులోని స్వయంభూ శ్రీసిద్ధివినాయక ఆలయాన్ని శుక్రవారం మెదక్‌జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు ఎస్పీ మహేందర్‌ను అర్చకులు ఆలయమర్యాదలతో స్వాగతంపలికారు. అర్చకులు ప్రకాశ్‌జోషి వేదమంత్రాలు వల్లిస్తుండగా సురేందర్ ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు అదనపు ఎస్పీకి ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అదనపు ఎస్పీ వెంట డిపిఓ సూపరింటెండెంట్ వల్ల నాయక్ ఉన్నారు.

## శివాజీ విగ్రహప్రతిష్ఠకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

**చిలిపిచెడ్, మార్చి 27, ప్రభాతవార్త:** చిలిపిచెడ్ మండలకేంద్రంలో శుక్రవారం గ్రామ యువకులతో కలిసి హనుమాన్ ఆలయం వద్ద పూజలునిర్వహించి మండలకేంద్రంలోని ప్రధాన కూడలి వరకు ర్యాలీగా వెళ్లి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికి ప్రధాన కూడలి వద్ద చత్రపతి శివాజీమహారాజ్ చిత్రపటాన్ని ఉంచి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి అనిల్, ఉపసర్పంచి శ్రీరాములు, సోమక్కపేట పిఎసిఎస్ డైరెక్టర్ గంగాధర్, చిలిపిచెడ్ మండల రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు అంతాగౌడ్, మండలబిజెపి ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, వార్డ్‌మెంబర్ చిట్కుల కిష్టయ్య, గ్రామస్థులు బాబురామకృష్ణ లింగాగౌడ్, రమేష్, కార్తీక్, రాజు, గోవర్ధన్, జగన్, నరేష్‌చారి, విష్ణు, సుమన్, దశరథ్, నారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం రవిచంద్రకు సత్కారం

**హుస్నాబాద్ టౌన్, మార్చి 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసే గద్దర్ అవార్డు గ్రహీత, పొన్నం రవిచంద్ర శుక్రవారం హుస్నాబాద్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్‌కు చెందిన కవులు ఆయనను ఘనంగా అభినందించారు. పొన్నం రవిచంద్ర గద్దర్ అవార్డు అందుకోవడం పట్ల సాహిత్య వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. హుస్నాబాద్ కవులు ఆయనను శాలువాతో సత్కరించారు. రవిచంద్ర జర్నలిజం రంగంలో చేసిన సేవలను కొనియాడుతూ, ఈ అవార్డు ఆయనకు దక్కడం సాహిత్య, సాంస్కృతిక రంగాలకు గర్వకారణమని కవులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జన జాగృతి కళా సమితి పక్షాన కవి సాయంత్రం, కవులు ముక్కెర సంపత్ కుమార్, దేవర కనకయ్య, కనుకుంట్ల శ్రీనివాస్, కొలుగూరి అశోక్, కళ్యాణ్ తదితరులు పాల్గొని పొన్నం రవిచంద్రను అభినందించారు.


రవిచంద్రను సత్కరిస్తున్న కవుల దృశ్యం

## నిరుద్యోగుల బాధలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా?

### -బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి


నిరుద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, మార్చి 27, ప్రభాతవార్త:** నిరుద్యోగుల ఉసురుతగిలి ఇంటిబాట పట్టిన బిఆర్‌ఎస్‌కు పట్టినగతే కాంగ్రెస్ పార్టీకి పట్టనుందని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీని ఎమ్మెల్సీ సందర్శించి లైబ్రరీలో చదువుకుంటున్న నిరుద్యోగులతో ఎమ్మెల్సీ ముచ్చటిస్తూ ఉద్యోగాలు లేక వారు పడుతున్న అవస్థలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ సరూర్‌నగర వేదికలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి 28నెలలు గడుస్తున్నా డిక్లరేషన్‌కు అతీగతీ లేదని ఆరోపించారు. నోటిఫికేషన్ ఆలస్యమైతే ఆర్థికభారం మోయలేక నిరుద్యోగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావని మండిపడ్డారు. సెంట్రల్ లైబ్రరీలో కనీస సౌకర్యాలు కరవయ్యాయని ఎమ్మెల్సీ తీవ్రంగా ఆరోపించారు.

## ఘనంగా శిశుమందిర్ విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవం


ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల బృందం

**పెద్దశంకరంపేట, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీసరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం శ్రీసరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రధాన ఆచార్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయభావంతో కూడిన విద్యను శిశుమందిరాలలో అందించడం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి పండుగనాడు శ్రీసరస్వతి విద్యాపీఠం స్థాపించడం జరిగిందని, శిశుమందిరాల విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దాదిగారి గంగాధర్, క్రాంతిలాల్, ప్రబంధకారుని సభ్యులు పున్నయ్య, జస్వంత్, టి. రవీందర్, రవివర్మ, రాము, ఆచార్యులు జైహింద్‌రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త:** కొండపాక మండలపరిధిలోని జప్తినాచారం గ్రామానికిచెందిన ముస్త్యాల ఎల్లవ్వ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. ఈవిషయన్ని ముస్త్యాల విష్ణు బిఆర్‌ఎస్ నాయకుడు అనంతుల ప్రశాంత్‌కు తెలియజేయగా స్పందించిన ప్రశాంత్ రూ.5వేలను అంత్యక్రియల కోసం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని, నిరుపేదలను ఆదుకున్నపుడే జీవితంలో నిజమైన సంతోషం లభిస్తుందన్నారు. ఆర్థికస్థోమత కలిగిన మానవతావాదులు నిరుపేదలను ఆదుకోవాలని ఈసందర్భంగా ప్రశాంత్ కోరారు.

# దేశప్రజలకు ప్రధాని శ్రీరామనవమి కానుక

### -పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన కేంద్రప్రభుత్వం
### -బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, మార్చి 27, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఆకాశానికి అంటడంతో సామన్య ప్రజల నడ్డివిరగకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెట్రోల్, డీజిల్‌లపై ఏకంగా 10రూపాయల ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విచ్చలవిడిగా చేసిన అప్పులు, చెల్లించని ఆయిల్ బాండ్ల వేల కోట్ల భారం నేటికి భారతదేశంపై ఉన్నా, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజలసంక్షేమమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పదే పదే పన్నులు తగ్గిస్తున్నా, తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయిని సైతం తగ్గించకుండా ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పిచేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ, అభిమానం ఉంటే తక్షణమే వ్యాట్ తగ్గించి పెట్రోల్ ధరను 100 రూపాయలకు తీసుకురావాలని హితవు పలికారు. కేంద్రప్రభుత్వం డీజిల్‌పై తన పన్నును సున్నాకు చేర్చినప్పుడు రాష్ట్రప్రభుత్వం ఎందుకు అధికపన్నులతో ప్రజలను దోచుకుంటోందని మండి పడ్డారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాన మంత్రి అడుగులు వేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సైతం అదే మోడీ మార్గంలో పయనించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి సూచించారు.